## ఎరువుల కొరత


బజార్‌హత్నూర్ సొసైటీ వద్ద ఎరువుల కోసం ఎదురు చూస్తున్న రైతులు

బజార్‌హత్నూర్, జూన్ 12 : బజార్‌హత్నూర్ మండలంలోని రైతులు ఎరువుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూరియా, డీఏపీ కోసం దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గురువారం ఉదయం ఆరు గంటలకే మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘ కార్యాలయానికి రైతులు తరలి వచ్చారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఎరువుల కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

## నష్టాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలి

### కలెక్టర్ల సమావేశంలో మంత్రి పొంగులేటి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 12 : వర్షాకాలంలో వచ్చే వరదల వల్ల కలిగే నష్టాన్ని నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో కృష్ణ, గోదావరి నదీ పరీవాహక జిల్లాల కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈసారి సాధారణం కంటే అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని, అందుకే అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. జిల్లాలో గతంలో సంభవించిన వరదలపై అధ్యయనం చేసి ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించామని, అపాయాలు లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, కలెక్టర్లు పాల్గొన్నారు.

## ఆరుగురు మృత్యువాత

# కూలీలపై పిడుగు

- రెండు చోట్ల ప్రమాదాలు
- ఏడుగురికి తీవ్ర గాయాలు
- రిమ్స్‌కు తరలింపు
- కుటుంబాల్లో విషాదఛాయలు


కోవ సునిత (ఫైల్)


గెడం నందిని (ఫైల్)

నార్నూర్/బేల జూన్ 12 : ఆదిలాబాద్ జిల్లాలో పిడుగుపాటుతో గురువారం ఆరుగురు కూలీలు మృత్యువాత పడ్డారు. చేనులో పనిచేనులో పనిచేస్తుండగా.. ఒక్కసారి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాదిగూడ మండలంలో నలుగురు, బేల మండలంలో ఇద్దరు చనిపోయారు. వివరాలిలా ఉన్నాయి. గాదిగూడ మండలంలోని పిప్రి గ్రామంలో గురువారం మధ్యాహ్నం పెందోర్ మహద్‌రావు చేనులో మక్క విత్తనాలు విత్తేందుకు 13 మంది కూలీలు పని కోసం వెళ్లారు. భారీ వర్షం కుస్తుండడంతో చేను వద్దే ఉన్న పందిరిలోకి వెళ్లారు. ఈ క్రమంలోనే భోజనం చేస్తుండగా.. ఒక్కసారి పిడుగు వారిపై పడింది. దీంతో సిడాం రాంబాయి(35), పెందోర్ మహద్‌రావు(42), పెందోర్ సంజన్న(19), మంగం భీంబాయి(35) అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మరో ఏడుగురికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎస్‌ఐ జీవన్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పిడుగు పడి నలుగురు మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

### బేల మండలంలో ఇద్దరు..


సాంఖాస్ గ్రామానికి చెందిన కోవ సునీత(38) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నది. గురువారం చేనులో పని చేస్తుండగా పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. రోజూ కూలీ పనులకు వెళ్లి వచ్చే అమ్మ మృతి చెందిందన్న వార్తతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సునీతకు భర్త భారత్‌తోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. అలాగే పెండల్‌వాడ గ్రామానికి చెందిన గెడం నందిని(30) కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేక పోవడంతో సాంగిడి గ్రామంలో ఉంటున్న తన తల్లి గారింట్లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నది. ఆమె భర్త హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. పిల్లల భవిష్యత్ చేసిన అప్పులు ఎలా తీర్చాలో అని భార్య కూడా వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో కూలీ పనులకు వెళ్లిన ఆమె పిడుగు పడి మృతి చెందడంతో గ్రామం శోకసంద్రంలో మునిగింది. ఆమెకు భర్త, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగ్‌నాథ్ తెలిపారు.


మార్చురీలో మృతదేహాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## పిడుగుపాటుతో మరణించడం బాధాకరం

- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, జూన్ 12(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో పిడుగుపడి ఆరుగురు మరణించడం బాధాకరమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పిడుగుపడి బేల మండలంలో ఇద్దరు వ్యవసాయ కూలీలు, గాదిగూడలో నలుగురు కూలీలు మరణించగా రిమ్స్ మార్చురీలో ఉన్న మృతదేహాలను ఆయన పరిశీలించారు. పేద కుటుంబాలకు చెందిన వారు వ్యవసాయపనులు చేస్తుండగా పిడుగుపడి మరణించిన ఘటన దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఆరుగురు కూలీలు మరణించడం వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపిందన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు రౌతు మనోహర్, యూనిక్ అక్బానీ, తన్వీర్, రాజేశ్ ఉన్నారు. పిడుగుపాటు బాధితులను సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ కూడా నాయకులతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



సిరికొండలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

- మూడు నెలల వేతనాలు ఇవ్వండి..
- కుటుంబ పోషణ భారంగా మారింది..
- ఉపాధి ఏపీవో, సాంకేతిక సహాయకులు, ఎఫ్‌ఏల వేడుకోలు

# పస్తులుంటున్నాం..

### ఇది పరిస్థితి..

| | |
|---|---|
| పంచాయతీలు | 472 |
| జాబ్ కార్డులు | 1,01,294 |
| కూలీలు | 2 లక్షలు |
| ఏపీవోలు | 14 |
| క్షేత్ర సహాయకులు | 225 |
| ఈసీఎస్ | 14 |
| సీవోఎస్ | 34 |

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 12 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు, క్షేత్ర సహాయకులకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్న వారికి సకాలంలో వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరు ఉపాధి పని జరిగే ప్రదేశాల్లో అక్రమాలకు తావివ్వకుండా పారదర్శకంగా పనులు నిర్వహించేందుకు నిరంతరం పర్యవేక్షణ చేస్తారు. కూలీలతో సమానంగా ఎండలో పనులు చేస్తున్నా సకాలంలో వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పస్తులుండాల్సిన దుస్థితి నెలకున్నది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 18 ఏళ్ల నుంచి ఉపాధి హామీలో పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కూడా లేదని క్షేత్ర సహాయకులు వాపోతున్నారు. సకాలంలో జిల్లా ఉన్నతాధికారులకు మండల ఏపీవో, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు(ఫీల్డ్ అసిస్టెంట్)లు వివిధ హోదాల్లో పని చేస్తున్న సిబ్బంది మొరపెట్టుకున్నా ఫలితం లేదు. కాగా.. వేతనాలు నిలిచిన మాట వాస్తవమే.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, త్వరలోనే డబ్బులు జమ అయ్యేలా చూస్తామని ఆదిలాబాద్ డీఆర్డీవో రవీందర్ రాథోడ్ తెలిపారు.



### అప్పులు చేయాల్సిన దుస్థితి

ప్రతి నెల వేతనాలు రాక కుటుంబ పోషణ భారంగా మారింది. ఇంటి అవసరాలతోపాటు పిల్లల చదువులకు ఫీజులు కట్టలేని పరిస్థితులు ఉన్నాయి. సకాలంలో వేతనాలు అందజేస్తే బాగుంటుంది. మూడు నెలల నుంచి వేతనాలు రాకుంటే మేం ఎలా బతకాలి. ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలి. - సుభాష్, టీఏ, సిరికొండ మండలం



### ఒకటో తేదీన జీతాలు జమ చేయాలి..

ప్రభుత్వం ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు వేస్తామని చెప్పి వేయడం లేదు. దీంతో ఉపాధి హామీ సహాయకులకు కుటుంబ పోషణ భారంగా మారుతుంది. ప్రభుత్వం ఉపాధి హామీ సిబ్బందికి పే స్కేల్ ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ.. అమలు చేయడం లేదు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఒకటో తారీఖున వేతనాలు వేస్తే బాగుంటుంది.

- పొల్లిపెల్లి రాజు, టీఏ రాష్ట్ర అధ్యక్షుడు

## తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎదులాపురం, జూన్ 12 : పిడుగు పడే సమయంలో జాగ్రత్తలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. కారు మబ్బులు కమ్ముకుని భారీ శబ్దాలతో ఉరుములు, మెరుపులు వస్తున్నాయంటే పిడుగులు పడతాయని గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలాన్నారు. ఈ పిడుగుపాటుకు వ్యవసాయ క్షేత్రాలు, చెట్లకింద ఉన్నవారే గురవుతున్నట్లు తెలిపారు.

### జాగ్రత్తలు..

ఉరుములు, మెరుపులు వస్తున్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు

లోహపు వస్తువులను చేతిలో పట్టుకోవడం మంచిది కాదు.

చెట్ల కింద, విద్యుత్ స్తంభాల దగ్గర ఉండకూడదు

విద్యుత్ స్తంభాల వద్ద ఉండకూడదు.

నీటిలో ఉండకూడదు

నదులు, వాగులు, చెరువుల్లో స్నానం చేయడం మంచిది కాదు

భూమి మీద అరికాళ్లు పూర్తిగా పెట్టకుండా వేళ్ల మీద కూర్చోవాలి

పిడుగు పడినప్పుడు విద్యుత్ ప్రభావం తక్కువగా పడే అవకాశం ఉంటుంది.

### ముడుచుకుని కూర్చోవాలి..

మోకాళ్లపై చేతులు, తలపెట్టి దగ్గరగా ముడుచుకుని కూర్చోవడం వల్ల పిడుగు పడినప్పుడు వెలువడే విద్యుత్ ప్రభావం తక్కువగా ఉంటుంది. ల్యాండ్ ఫోన్ మాట్లాడ కూడదు. సెల్ ఫోన్ వినియోగించవచ్చు.(అది కూడ ఇంట్లో ఉన్నపుడు మాత్రమే). స్విచ్‌బోర్డ్ నుంచి అన్ని కనెక్షన్లు తీసివేయాలి. షవర్ కింద స్నానం, చేతులు, గిన్నెలు కడగడం వంటివి చేయకూడదు. ఇంటి తలుపులు, కిటికీల వద్ద నిలబడకూడదు. మూసి ఉంచాలి. ఈ సందర్భంగా ఎక్కువగా ఈ పిడుగుపాటుకు వ్యవసాయ పనులు చేసే రైతులు, ఆరు బయట పనిచేసే భవన కార్మికులు, నీటి గొట్టాలు బిగించే వారు, విద్యుత్ టవర్ల వద్ద పనిచేసే వారు, వాహనదారులు, పాదచారులు పిడుగుపాటుకు ఎక్కువగా గురవుతున్నారని పైన తెలిపిన కొన్ని జాగ్రత్తలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని కలెక్టర్ ప్రజలను కోరారు.

## ముగ్గురికి గాయాలు



చికిత్స పొందుతున్న ధన్‌రాజ్, నిర్మల

ఉట్నూర్ రూరల్, జూన్ 12 : కుమ్మరితాండ గ్రామంలో గురువారం పిడుగు పడి ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరి తాండ గ్రామానికి చెందిన బోకన్ ధన్‌రాజ్, నిర్మల, కృష్ణబాయిలు తమ చేనులో వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. ఒక్కసారి ఉరుములతో కూడిన వర్షం రావడంతో సమీపంలో గుడిసెలోకి వెళ్లారు. గుడిసె సమీపంలో పిడుగు పడడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ సమాచారం అందించారు. మెరుగైన చికిత్స కొరకు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

## చేతబడి చేస్తున్నాడని వృద్ధుడి హత్య

లోకేశ్వరం, జూన్ 12 : నగర్‌కు చెందిన వృద్ధుడు గడ్డం పోసులు(64) చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో హత్య చేశారు. ఎస్‌ఐ అశోక్ వివరాల ప్రకారం.. గురువారం ఉదయం గడ్డం పోసులు ఇంటి నుంచి పొలానికి వెళ్తున్నాడు. నగర్ బస్టాండ్ వద్ద అదే గ్రామానికి చెందిన గడ్డం గంగాధర్, గడ్డం సాయిలు కాపు కాచి తమ వెంట తెచ్చుకున్న సిమెంట్ ఇటుకతో తలపై కొట్టి హత్య చేశారు. వీరి కుటుంబంలో సంవత్సరం క్రితం 17 నెలల కూతురు, రెండు నెలల క్రితం 2 ఆవులు చనిపోయాయని పోసులుపై కక్ష పెంచుకున్నారు. అలాగే తల్లి లక్ష్మి కూడా కొన్నేండ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నది. పోసులు చేతబడి చేయడం వల్లే సమస్యలు వస్తున్నాయని భావించి అతడిని హత్య చేశారు. సమాచారం అందుకున్న భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, ముథోల్ సీఐ మల్లేశ్, ఎస్‌ఐలు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్ వెంకట్‌రావ్‌పేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోకి వస్తున్న విద్యార్థినులు


## మోగిన బడిగంట

- పాఠశాలలు పునఃప్రారంభం
- సమస్యలతో స్వాగతం

వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. మొదటి రోజైన గురువారం విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు, సిబ్బంది మామిడి తోరణాలు, బెలూన్స్ కట్టి ఆహ్లాదకరమైన వాతావరణంలో స్వాగతం పలికారు. స్వీట్లు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించారు. కొన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పిచ్చి మొక్కలు, నీటి గుంతలతో అపరిశుభ్ర వాతావరణం నెలకున్నది. దుర్గంధం రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ముక్కు మూసుకుని తరగతి గదుల్లోకి వెళ్లారు.


బజార్‌హత్నూర్‌లో నీటి గుంతలమయమైన పాఠశాల ఆవరణ

## పెండింగ్ పనులకు నిధులు విడుదల చేయాలి

- మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జూన్ 12 : బీఆర్‌ఎస్ హయాంలో ప్రజలు, విద్యార్థులకు మేలు చేయడానికి ప్రారంభించిన పనులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పెండింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన మైనార్టీ సంక్షేమ హాస్టల్, బీసీ గురుకులంతోపాటు ఇంటిగ్రేటెడ్ మార్కెట్, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీ, జైనథ్ సబ్‌స్టేషన్ పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన రేవంత్‌రెడ్డి విద్యా వ్యవస్థను అధ్వానంగా మార్చేస్తున్నాడని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో 'మన ఊరు- మన బడి' ద్వారా స్కూల్‌లో మౌలిక వసతులు కల్పిస్తూ పూర్తి చేశామన్నారు. వాటి బిల్లులను రేవంత్‌రెడ్డి విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. పెండింగ్ పనులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పూర్తి చేయకుంటే విద్యార్థుల పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనిస్ అక్బానీ, మెట్టు ప్రహ్లాద్, సాజిదుద్దీన్, దాసరి రమేశ్, పవన్ నాయక్ దమ్మపాల్, బట్టు సతీశ్, అన్నెల వసంత్, దయానంద్, జావిద్, మహేశ్, ముఖిద్, అశోక్ పాల్గొన్నారు.


పెండింగ్ పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న



మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

## ఆన్‌లైన్ గేమ్ రాకెట్ గుట్టురట్టు

- ఐదుగురిపై కేసు
- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, జూన్ 12(నమస్తే తెలంగాణ) : ఆన్‌లైన్ గేమింగ్ పేరిట ప్రజలకు లాభాలు వస్తాయని ఆశ చూపిన ముఠా గుట్టు రట్టు చేసినట్లు ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆన్‌లైన్ గేమింగ్ ముఠా సభ్యులు బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని పంచవటీ హోటల్‌లో గదిని అద్దెకు తీసుకున్నారని, కొందరు వ్యక్తులతో గేమ్ ఆడిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. గదిలో ఐదుగురు ఉండగా ఒకరు పారిపోయారు. మిగతా ప్రకాశ్ బద్దు రాథోడ్, జాదవ్ ప్రహ్లాద్, పంకజ్ నాందేవ్, బోంద్రే సూర్యభాన్‌లను పట్టుకున్నామన్నట్లు పేర్కొన్నారు. వీరిని విచారించగా నెక్సబెట్ అనే గేమ్‌లో రూ.9100 పెట్టుబడి పెడితే గెలిచిన తర్వాత 100 అమెరికన్ డాలర్లు వస్తాయని నమ్మిస్తూ గేమ్ ఆడిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి నెక్సబెట్ పుస్తకాలు, క్రేటా కారు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయించిన వ్యక్తి అరెస్ట్

పట్టణంలోని బుధవారం సాయంత్రం ఎన్టీఆర్ చౌక్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో స్కూటీపై ఒక వ్యక్తి అనుమానాస్పదంగా వచ్చి పోలీసులను తప్పించుకునే ప్రయత్నం చేయగా అతన్ని పట్టుకున్నామని ఎస్పీ తెలిపారు. అతన్ని విచారిస్తే తన పేరు దహికాంబ్లే వికాశ్ అని తేజా మెడికల్ దుకాణంలో పనిచేస్తున్నట్లు తెలిపాడని చెప్పారు. తాను టెర్మిన్ డ్రగ్ మూడు చిన్న బాటిళ్లను రూ.369కు కొనుగోలు చేసి రూ.1500 అమ్మడానికి గుడిహత్నూర్‌కు వెళ్తున్నట్లు తెలిపాడని అన్నారు. మెడికల్ షాపు యజమానులకు డ్రగ్స్‌పై పర్యవేక్షణ ఉండాలన్నారు. యువత డ్రగ్స్‌కు బానిసై జీవితాలను పాడుచేసుకోవద్దని సూచించారు.

### లెక్చరర్‌పై కేసు

మల్టీ లెవల్ మార్కెటింగ్ పేరిట మోసాలకు పాల్పడుతున్న ప్రభుత్వ లెక్చరర్‌పై కేసు నమోదు చేశామన్నారు. ట్రేసూర్ ఫన్ అనే సంస్థలో పెట్టుబడులు పెడితే 3 శాతం వడ్డీతోపాటు ఇతరులను సంస్థలో చేర్పిస్తే రూ.200 అధికంగా ఇస్తామని అమాయకులను మోసం చేస్తున్న ఆదిలాబాద్ పట్టణం పాత హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ప్రభుత్వ లెక్చరర్ సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలు మల్టీలెవల్ మార్కెటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలని, మోసాలకు గురైతే 1930కు ఫోన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ సునీల్ కుమార్ పాల్గొన్నారు.